# అహం * గోపీచంద్

ఒక కవి ఒక సభలో ఈ విధంగా ఉపన్యసిస్తున్నాడు:

"మీరు కనిపెట్టారో లేదో కాని నేను తిక్కన కంటె గొప్పవాణ్ణి. నా కవిత్వంలో తిక్కన కవిత్వంలో ఉన్న గుణాల కంటె గొప్ప గుణాలున్నాయి. ఇంతవరకు భారతదేశంలో పుట్టిన వాళ్ళలో తిక్కనకంటె గొప్పకవిని నేనే..."

ఒక సభికుడు చివాలున లేచి — 'తిక్కన కంటె మీరు గొప్పకవులను కోటానికి దృష్టాంతరం ఏమిటి?'

"దృష్టాంతరమా?-దృష్టాంతరమా" అని నడుంకొట్టడం మొదలెట్టాడు కవి.

ఇంకో సభికుడు లేచి ఈ విధంగా జవాబు చెప్పాడు -

"ఈ దృష్టాంతరాలకేం, కావలసినన్ని ఉన్నాయి. తిక్కనా కవిత్వం రాశాడు. వీరూ కవిత్వం రాశారు. తిక్కనా పుట్టాడు; వీరూ పుట్టారు. వీటిని బట్టి తిక్కనకూ వీరికి చాలా పోలికలున్నవని విశదం అవుతూంది. ఇక తిక్కన కంటె ఈయన గొప్పవాడెలాగంటారా? తిక్కన చచ్చాడు; ఈయన చావలేదు" అని కూర్చున్నాడు.

కవి తెల్లమొహం వేశాడు.